# కాంగ్రెస్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

- **ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం, ఆర్థిక సంఘం నుంచి ఆగిపోయిన నిధులు**
- **ఏ పనికైనా గ్రామ కార్యదర్శి సొంత సొమ్ము వెచ్చించాల్సిందే**
- **ఉపాధి పనిదినాలు 150కి పెంచుతామన్న కాంగ్రెస్ హయాంలో కనీసం 100 పనిదినాలకే దిక్కులేదు**
- **నేడు పంచాయతీరాజ్ దినోత్సవం**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమవుతున్నాయి. పంచాయతీలు పటిష్టంగా ఉంటేనే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందన్న గాంధీజీ మాటలు నీటి మూటలవుతున్నాయి. దేశానికి పట్టుగొమ్మలుగా ఉండాల్సిన పల్లెలు ప్రగతిలో పడకేశాయి. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు వాటిలో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేకపోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 15నెలలు అవుతున్నా స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వంతోపాటు, 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. ఫలితంగా గ్రామాల్లో కనీస వసతులు కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత డబ్బును వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పల్లెలు ప్రగతిపథంలో పరుగులు తీస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే అభివృద్ధి ఆగిపోయింది. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్న ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 24న దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. అందులో భాగంగా గురువారం తెలంగాణలోనూ ఈ దినోత్సవాన్ని నిర్వహించబోతున్నప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కారు వైఫల్యాల వల్ల అభివృద్ధి పడకేయడంతో రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ ఉత్సాహం కనిపించలేదు.

### 'అభయ హస్తం' మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'అభయ హస్తం' పేరిట విడుదల చేసిన మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు గుప్పించింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే గ్రామాల అభివృద్ధికి చేపట్టే చర్యలను అందులో ప్రకటించింది. ఆ హామీలు ఇవీ..

- 'దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన 73, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం మూడంచెల స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో నిధులు, విధులు అప్పగిస్తామని చెప్పింది. కానీ, నిరుడు ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలు, జూన్‌లో మండల, జిల్లా పరిషత్తుల పాలకర్గాల పదవీకాలం ముగిసినా రేవంత్‌రెడ్డి సర్కారు నేటికీ ఎన్నికలు నిర్వహించలేదు.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను 150 రోజులకు, కనీస వేతనాన్ని రూ.350కి పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ గత ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో ఒక్కో కూలీకి సగటున దక్కింది రూ.271 మాత్రమే. పనిదినాల సంఖ్యను కూడా దాదాపు సగానికి తగ్గించారు. తెలంగాణలో గత ఆర్థిక సంవత్సరం 12 కోట్ల పనిదినాలు ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 6.5 కోట్ల పని దినాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది.
- గ్రామ పంచాయతీల్లోని సిబ్బందికి కనీస వేతనాన్ని అందజేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కింది. గత 2-3 నెలలుగా గ్రామ పంచాయతీల సిబ్బందికి అసలు వేతనాలే రావడం లేదు. కొన్ని చోట్ల డిసెంబర్ నెల వేతనానికి సంబంధించి కార్మికులకు చెక్కులు ఇచ్చినప్పటికీ ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో ఆ చెక్కులు చెల్లడం లేదు. ఒక్కో కార్మికుడు తన కుటుంబాన్ని పోషించుకోవాలంటే నెలకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ, పంచాయతీ కార్మికులకు నెలవారీగా ఇస్తున్న వేతనం రూ.9,500 మాత్రమే. అది కూడా రెగ్యులర్‌గా అందడం లేదు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేని వారిని ఎప్పుడు తొలగిస్తారో తెలియదు.
- గిరిజన ప్రాంతాల్లోని పీఈఎస్ఏ చట్టాన్ని సవరణలతో అమలుచేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పినప్పటికీ పంచాయతీ నిబంధనల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం-1996 ఎక్కడా అమలు కావడం లేదు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సంప్రదాయ గ్రామసభల ద్వారా స్వయం పాలన సదుపాయాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. దోపిడీ నుంచి గిరిజనులను కాపాడటం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఆ చట్టాన్ని సవరించకపోగా రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయడం లేదు.
- మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ పెన్షన్ అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంతో ఘనంగా ప్రకటించింది. కానీ, గత ఏడాదిన్నర కాలంగా గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పనుల బిల్లులనే రేవంత్‌రెడ్డి సర్కారు ఇప్పటివరకు చెల్లించలేదు. దీంతో తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు రోజుకో రూపంలో ఆందోళనకు దిగుతున్నారు.
- ఇటీవలి కాలంలో నియమించిన పంచాయతీ కార్యదర్శుల సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించడంతోపాటు వారికి పూర్తిస్థాయి వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు పంచాయతీలకు నిధులే విడుదల చేయడం లేదు. దీంతో పంచాయతీల గ్రామ కార్యదర్శులు తమ సొంత డబ్బును వెచ్చించాల్సి వస్తున్నది. మరోవైపు వారు అధికార పార్టీ నేతల వేధింపులకు తాళలేకపోతున్నారు. 'అధికార పార్టీ నేతలతో ఇబ్బందులు పడుతున్నా. నిజాయితీగా విధులు నిర్వర్తించలేకపోతున్నా' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ కార్యదర్శి లేఖసంచలనంగా మారింది.




### మాకు ఉద్యోగ భద్రత లేదు

పంచాయతీ కార్మికులు క్యాటగిరీలవారీగా కారోబార్, బిల్ కలెక్టర్, వాటర్‌మెన్ ఉండాలి. కానీ, జీవో 51 తీసుకొచ్చి కలగూరగంపలా మార్చారు. అందరూ అన్ని పనులు చేయాల్సిందేనని చెప్పారు. ఎవరిని ఎప్పుడు తొలగిస్తరో తెలియదు. మాకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. బ్యాంకు ఖాతాల ద్వారా ఆన్‌లైన్‌లో వేతనాలు చెల్లిస్తామని చెప్పిన ఉన్నతాధికారులు.. ఇప్పుడు కొత్తగా మే నుంచి ఖాతాల్లో వేతనాలు వేస్తామంటున్నారు. జీపీ ఖాతాల్లో బడ్జెట్ లేదు. గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులు రావడం లేదు.

*– గ్యార పాండు, గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు*

### 'మాల్'కు జాతీయ అవార్డు

**రాష్ట్రం నుంచి ఈసారి ఒక్కగ్రామమే ఎంపిక**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలోని మాల్ గ్రామ పంచాయతీకి జాతీయ అవార్డు దక్కింది. ఈసారి రాష్ట్రం నుంచి ఈ ఒక్క గ్రామమే జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఆత్మనిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డ్ విభాగంలో మాల్ గ్రామం ప్రథమస్థానంలో నిలిచింది. ఇందుకు కోటి రూపాయల ఆర్థిక ప్రోత్సాహకం కేంద్రం నుంచి లభించనున్నది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం (నేడు) ఢిల్లీలో అవార్డును అందజేయనున్నారు. కొత్తగా క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డ్, ఆత్మనిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డ్, పంచాయత్ సామర్థ్య నిర్మాణ సర్వోత్తమ సంస్థ పురస్కారం ప్రవేశపెట్టారు. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులకు గ్రామాలను ఎంపిక చేశారు. 1వ స్థానం రూ.1 కోటి, 2వ స్థానం రూ.75 లక్షలు, 3వ స్థానానికి రూ.50 లక్షల చొప్పున నగదు బహుమతి ఇస్తారు.

# మధ్యాహ్న భోజనం లబ్ధిదారులకు కోత

- **ఈసారి 16 లక్షల మంది విద్యార్థులకే పరిమితం**
- **నిరుడు 18.88 లక్షల మందికి పీఏబీ ఆమోదం**
- **నిధులను సక్రమంగా ఖర్చుచేయని రాష్ట్ర ప్రభుత్వం**
- **నాలుగో త్రైమాసికం నిధులు ల్యాప్స్**
- **ఈ ఏడాది వచ్చింది మూడు త్రైమాసికాల నిధులే**



హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన పథకం లబ్ధిదారులకు కేంద్రం కోత పెట్టింది. 3 లక్షల మంది విద్యార్థులను తగ్గించింది. 2025-26 విద్యాసంవత్సరానికి 16లక్షల మంది విద్యార్థులకే ఆమోదం తెలిపింది. నిరుడు 18.88లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కేంద్రం ఆమోదం తెలుపగా, ఈ సారి 16లక్షల మంది విద్యార్థులకే పరిమితం చేసింది. మధ్యాహ్న భోజనం పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కేంద్రం 60%, రాష్ట్రం 40% నిధులను ఖర్చుచేస్తున్నాయి. 2025-26 విద్యాసంవత్సరానికి మధ్యాహ్న భోజన పథకం ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశాన్ని ఇటీవలే నిర్వహించారు. ఈ సారి రాష్ట్రం నుంచి అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. అయితే యూడైస్ ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా లబ్ధిదారుల సంఖ్యను 16లక్షలకే కేంద్రం పరిమితం చేసింది.

### ఒక త్రైమాసికం నిధులు ల్యాప్స్

ఈ పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా ఖర్చుచేయలేకపోతున్నది. ఫలితంగా 2024-25 విద్యాసంవత్సరంలో ఒక త్రైమాసికం నిధులు మురిగిపోయాయి. ఈ విద్యాసంవత్సరంలో 18లక్షల లబ్ధిదారులకు రూ.341కోట్లు ఖర్చుచేసేందుకు పీఏబీ ఆమోదం తెలిపింది. దీంట్లో కేంద్రం వాటా రూ.232కోట్లు కాగా రాష్ట్రవాటా రూ. 109 కోట్లు. అయితే ఇప్పటి వరకు కేంద్రం వాటాలో మూడు త్రైమాసికాల నిధులు రూ.189 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇటీవలే మూడో త్రైమాసికం కింద రూ. 43కోట్లు మార్చి, ఏప్రిల్ మాసాలకు కేటాయించారు. కేంద్రం ఏ త్రైమాసికం నిధులను ఆయా త్రైమాసికంలో ఠంచన్‌గా ఖాతాలో జమచేస్తున్నది. అయితే రాష్ట్ర వాటా నిధులను విడుదల చేసిన తర్వాతే కేంద్రం వాటా నిధులను వాడుకునే వెసులుబాటు ఉంది. రాష్ట్రవాటాను సక్రమంగా విడుదల చేయకపోవడంతో కేంద్రం వాటా నిధులు సకాలంలో విడుదల కావడంలేదు. ఫలితంగా కేంద్రం నుంచి రావాల్సిన నాలుగో త్రైమాసికం నిధులు నీళ్లల్లో కలిసిపోయినట్టయ్యింది.

### రూ.359 కోట్లకు ప్రతిపాదనలు

కొత్తగా 2025-26 విద్యాసంవత్సరానికి రూ. 359 కోట్లకు విద్యాశాఖ ప్రతిపాదనలు సమర్పించింది. పిల్లల సంఖ్య 3లక్షలు తగ్గినప్పుడు నిధులెలా పెంచుతామని కేంద్రం అడిగినట్టు సమాచారం. విద్యార్థుల సంఖ్య తగ్గినా ఇటీవలే మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచిన నేపథ్యంలో రూ. 359 కోట్లకు ఆమోదం తెలపాలని రాష్ట్ర అధికారులు కేంద్రాన్ని కోరారు. అయితే పీఏబీ సమావేశం మినట్స్ బయటికి వస్తేనే కేంద్రం ఎంత మొత్తానికి అంగీకరించింది అన్నది తెలుతుంది.

# సెక్షన్-3 టీవోఆర్‌పై ఏపీ అభ్యంతరం

**సుప్రీంకోర్టులో వాదనలు ప్రారంభం**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణపై అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ సుప్రీంకోర్టు ఎదుట ఏపీ తన వాదనలు వినిపించింది. జస్టిస్ సూర్యకాంత్ బెంచ్ ఎదుట బుధవారం వాదనలు ప్రారంభమయ్యాయి. కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-2కు కేంద్రం నూతన మార్గదర్శకాలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ ఏపీ సర్కారు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. కొత్త టీవోఆర్ చెల్లబోదని, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి అది విరుద్ధమని ఏపీ వాదిస్తున్నది. ట్రిబ్యునల్ విచారణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు.. తన వాదనలను వినిపించేందుకు ఏపీకి అనుమతిచ్చింది. ఈ సందర్భంగా తన వాదనలను ప్రారంభించిన ఏపీ.. కృష్ణాబేసిన్ ప్రాథమిక సమాచారాన్ని వివరించింది. గురువారం కూడా విచారణ కొనసాగనున్నది.

# మే 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- **వివరాలు వెల్లడించిన ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలలైంది. సప్లిమెంటరీ పరీక్షలు మే22నుంచి 29 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఇంటర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసిన నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు కార్యదర్శి క్రిష్ణాదిత్య బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇదే సమ యంలో వొకేషనల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జూన్ 3నుంచి 6 వరకు ప్రాక్టికల్స్, జూన్ 9న ఫస్టియర్, 10న సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

**పరీక్షల షెడ్యూల్**

| తేదీ | ఫస్టియర్(ఉదయం) | సెకండియర్ (మధ్యాహ్నం) |
|---|---|---|
| 22-5-25 | రెండోభాష పేపర్ -1 | రెండోభాష పేపర్ -2 |
| 23-5-25 | ఇంగ్లిష్ పేపర్ -1 | ఇంగ్లిష్ పేపర్ -2 |
| 24-5-25 | గణితం పేపర్ -1ఏ, బోటనీ పేపర్ -1<br>పొలిటికల్ సైన్స్ పేపర్ -1 | గణితం పేపర్ -2ఏ, బోటనీ పేపర్ -2<br>పొలిటికల్ సైన్స్ పేపర్ -2 |
| 25-5-25 | గణితం పేపర్ -1బీ, జువాలజీ పేపర్ -1<br>చరిత్ర పేపర్ -1 | గణితం పేపర్ -2బీ, జువాలజీ పేపర్ -2<br>చరిత్ర పేపర్ -2 |
| 26-5-25 | ఫిజిక్స్ పేపర్ -1, ఎకనామిక్స్ పేపర్ -1 | ఫిజిక్స్ పేపర్ -2, ఎకనామిక్స్ పేపర్ -2 |
| 27-5-25 | కెమిస్ట్రీ పేపర్ -1, కామర్స్ పేపర్ -1 | కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్ -2 |
| 28-5-25 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -1 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2 |
| 29-5-25 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -1 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -2 |



వెంకటాపురం(నూగూరు) కేజీబీవీ ఆవరణలో హెలికాప్టర్

# కర్రెగుట్టల్లో ముమ్మర కూంబింగ్

- **మావోయిస్టుల కోసం భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్**
- **కీలక నేత హిడ్మా దళం లక్ష్యంగా 'బచావో కర్రెగుట్టలు?'**
- **వేల మంది పోలీసులు, రెండు హెలికాప్టర్ల మోహరింపు**

ములుగు, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పరిధిలోని కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నది. బుధవారం కూడా పోలీస్, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. మావోయిస్టు కీలక నాయకుడు హిడ్మా దళం కోసం గాలింపు చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు గుట్టపై బాంబులు అమర్చామని మావోయిస్టులు ప్రకటన విడుదల చేశారు. పోలీసులు 'బచావో కర్రెగుట్టలు' పేరుతో స్పెషల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. 250 కిలోమీటర్ల మేర విస్తరించిన కర్రెగుట్టలను వేలాదిమంది బలగాలు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తున్నది. మావోయిస్టుల కదలికల ప్రచారం, పోలీసుల కూంబింగ్‌తో ఏజెన్సీలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

### రంగంలోకి రెండు హెలికాప్టర్లు

వెంకటాపురం(నూగూరు) కస్తూర్బా పాఠశాల ఆవరణలో భద్రతా బలగాల అధికారులు బుధవారం రెండు హెలికాప్టర్లను మోహరించారు. హెలిప్యాడ్ వైపు వెళ్లేందుకు ఎవరినీ అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో హెలికాప్టర్లు తిరుగుతున్నాయని, కాల్పుల శబ్దాలు కూడా వినిపిస్తున్నాయని, ములుగు ప్రాంతంలో ఇంతపెద్ద స్థాయిలో కూంబింగ్ నిర్వహించడం ఇదే తొలిసారి అని సమీప గామాల ప్రజలు చెప్తున్నారు.

# ఉపాధి హామీకి గండి

- **6.5 కోట్ల పనిదినాలే మంజూరు**
- **నిరుటికంటే 1.5 కోట్ల తగ్గింపు**
- **ఉపాధి పని దినాలు పెంచాలని కేంద్రానికి లేఖ రాయనున్న రాష్ట్రం**
- **రూ.2,700 కోట్ల నిధులు**
- **వేతనాలకు రూ.1,625 కోట్లు.. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1,083 కోట్లు**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యానికి కేంద్ర సర్కారు గండికొట్టింది. పని దినాలకు భారీగా కోతపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 6.5 కోట్ల పని దినాలనే మంజూరు చేసింది. గత సంవత్సరం కంటే కోటిన్నర పని దినాలను తగ్గించింది. 12 కోట్ల పనిదినాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు చేస్తే, 6.5 కోట్ల పని దినాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. గత సంవత్సరం 8 కోట్ల పనిదినాలు కల్పించగా, ఈసారి అందులో 1.5 కోట్ల పనిదినాలకు కోతపెట్టింది. పైగా డిమాండ్ ఆధారంగా కాకుండా అవసరాల ప్రాతిపదికన పనులుచేపట్టాలని ఆదేశాలిచ్చింది.



### కేసీఆర్ హయాంలో పెద్దఎత్తున పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలు 1.10 కోట్ల మందికిపైగా ఉన్నారు. వీరిలో యాక్టివ్ కూలీలు 54.85 లక్షల మంది ఉన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో పెద్ద మొత్తంలో ఉపాధి హామీ పనులు చేపట్టడంతో చాలామందికి వంద రోజులపైగా పనిదినాలు లభించాయి. కేంద్రం మంజూరు చేసిన పనిదినాల కంటే మించి పనులు జరిగేవి. గడిచిన ఐదేండ్లలో ఏటా పదికోట్లకు పైగా పనిదినాలను కేంద్ర సర్కారు మంజూరుచేసింది. ఈ ఏడాది ఒకేసారి సగం పనిదినాలకు గండికొట్టింది. గత ఏడాది మాదిరిగానే 12 కోట్ల పనిదినాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు చేస్తే.. 6.5 కోట్ల పనిదినాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది.

**కేంద్రం మంజూరు చేసిన పనిదినాలు (కోట్లల్లో)**

| | |
|---|---|
| 2020-21 | 15.50 |
| 2021-22 | 14.25 |
| 2022-23 | 11 |
| 2023-24 | 10.50 |
| 2024-25 | 12 |
| 2025-26 | 6.5 |

### రాష్ట్ర నిధులు రూ.2,708.3 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది రూ.2,708.3 కోట్ల నిధులు కేటాయించింది. వేతనాలకు రూ.1,625 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1,083 కోట్లు కేటాయిస్తూ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. ఈ ఏడాది మహిళాశక్తి ఉపాధి భరోసా, వన మహోత్సవం, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనకు నిర్ణయించారు. పనిదినాలు పెంచాలని కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గత నాలుగేండ్లలో కూలీలకు వేతనాల రూపంలో రూ.2 వేల కోట్లకు పైగా వెచ్చించారు. కానీ, ఈ ఏడాది ఆ బడ్జెట్‌ను రూ.1,625 కోట్లకే పరిమితం చేశారు.

# ఈ నాలుగిండ్లు మాకొద్దు

- **60 ఇండ్లు ఇయ్యండి.. లేదంటే ఈ నాలుగు రద్దు చేయండి**
- **ఇండ్ల మంజూరుపై రామన్నగూడెం గ్రామస్థుల మండిపాటు**
- **రహదారిపై బైఠాయించి నిరసన**

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23 : 'మా గ్రామానికి కేవలం నాలుగు ఇండ్లు మాత్రమే మంజూరు చేశారు. ఇస్తే 60 ఇండ్లు ఇయ్యండి.. లేదంటే ఈ నాలుగు కూడా రద్దు చేయండి' అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెం ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు బుధవారం ఆందోళనకు దిగారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నగూడెం ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అశ్వారావుపేట-రామన్నగూడెం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. గ్రామంలో 200 కుటుంబాలు ఉండగా.. 60 మందికి ఇండ్లు లేవని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం నాలుగు ఇండ్లు మంజూరు చేయడాన్ని నిరసిస్తూ ఇందిరమ్మ కమిటీ ముందుగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించింది. మంజూరైన నాలుగు ఇండ్లను కూడా రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించినట్టు కమిటీ సభ్యులు కోర్స ప్రసాద్, రాచకొండ బంగారం, కే ఉదయ్‌కుమార్, నారం కుమారి తెలిపారు.

# నేడు ఢిల్లీలో టీఏసీ భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర జల్‌శక్తి శాఖ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి టెక్నికల్ అప్రైజల్ కమిటీ (టీఏసీ) గురువారం మధ్యాహ్నం ఢిల్లీలో సమావేశం కానున్నది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 'సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు'కు సంబంధించిన అనుమతులతోపాటు పలు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతుల మంజూరుపై చర్చించనున్నది. సీతారామ ఎత్తిపోతల పథకంపై గత ఫిబ్రవరిలో నిర్వహించిన టీఏసీ 157వ సమావేశం లో చర్చించినప్పటికీ, పలు అంశాలపై సందేహాలను వ్యక్తంచేస్తూ తుది అనుమతులను నిరాకరించారు. ఆయా అంశాలపై తెలంగాణ సహేతుకమైన ఆధారాలను సమర్పించగా, కేంద్ర ప్రభుత్వం సైతం సంతృప్తిని వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో 158వ టీఏసీ సమావేశంలో తుది అనుమతులపై చర్చించనున్నారు. స మావేశంలో పాల్గొనేందుకు ఈఎన్సీ అనిల్‌కుమార్, గోదావరి అంతర్రాష్ట్ర విభాగం అధికారి సుబ్రహ్మణ్యప్రసాద్ ఢిల్లీకి తరలివెళ్లారు.

# భక్తులూ.. బీ కేర్‌ఫుల్..!

- ***ఆధ్యాత్మిక పర్యాటకంపై కన్నేసిన సైబర్ నేరగాళ్లు***
- ***ఏటా రూ.700 కోట్లు కొల్లగొడుతున్న దొంగలు***
- ***పుణ్యక్షేత్రాల వెబ్‌సైట్లు, ఏజెన్సీల పేరుతో మోసాలు***
- ***ఇటీవల పెద్దసంఖ్యలో మోసపోతున్న బాధితులు***
- ***హెచ్చరిస్తున్న సైబర్ పోలీసులు***

*హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన 31 ఏండ్ల ఓ ప్రైవేటు ఉద్యోగి శ్రీశైలం దర్శనానికి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నాడు. అక్కడి వైశ్యసత్రంలో గది బుక్ చేసుకున్నాడు. గదికి రూ.1,000 కాగా ఆ మొత్తం ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. అదనంగా రూ.180 జీఎస్టీ చెల్లించాలంటూ కాల్ వచ్చింది. కానీ జీఎస్టీ చెల్లించనందున రూమ్ బుక్ కాకపోవడంతో, తాను చెల్లించిన మొత్తాన్ని రిటర్న్ చేయాలని కోరాడు. రీఫండ్ ప్రక్రియ కోసం రూ.1 చెల్లించాలని అవతలి వ్యక్తి అడగగా చెల్లించాడు. ఆ తర్వాత తన అకౌంట్‌లో లక్షరూపాయలు మాయం కావడంతో కంగుతిన్నాడు. కాల్ చేసిన వ్యక్తులను సంప్రదించగా.. వారు స్పందించకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.*

### *సోషల్‌మీడియాలో ప్రచారాన్ని నమ్మి!*

*ఏవైనా టూర్లు, సౌకర్యాల పేరుతో వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో వచ్చే లింకులు, ప్రకటనలు చూసి నమ్ముతున్న జనాలు ఆన్‌లైన్‌లో ముందస్తు చెల్లింపులు చేస్తున్నారు. కొన్ని ఫేక్ ట్రావెల్ ఏజెన్సీలు గూగుల్ రిజిస్ట్రర్లతో కూడిన నకిలీ లింకులు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. బాధితులు తాము అంతదూరం వెళ్లి సదుపాయాలు తీసుకోవడం కష్టం కాబట్టి ముందుగానే ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకుని వెళ్తే ప్రయాణం సుఖవంతమవుతుందని భావిస్తున్నారు.*



*అయితే ఆన్‌లైన్‌లో తాము బుక్ చేసుకున్న తర్వాత ఎలాంటి కన్‌ఫర్మేషన్ రాకపోవడం, ఫోన్‌నెంబర్లు పనిచేయకపోవడం, రీఫండ్ అవకాశం లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందుకే స్పాన్సర్డ్ యాడ్స్‌ను నమ్మవద్దని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలని సైబర్ పోలీస్ అధికారులు చెప్తున్నారు. సంక్షిప్తమైన యూఆర్ఎల్ (bit.ly, tinyurl) లను నమ్మవద్దని, ఏదైనా సమస్య వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.*

### ఏటా భారీ మొత్తంలోనే మోసం

*రోజుకో తరహా కొత్తరకం మోసాలు చేస్తూ వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న సైబర్ క్రిమినల్స్ తాజాగా ఆధ్యాత్మిక పర్యాటకంపై కన్నేశారు. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులను టార్గెట్‌గా చేసుకుంటూ మోసాలు చేస్తున్నారు. ఇటీవల వరుసగా ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ అప్రమత్తమైంది. ఆధ్యాత్మికతను అడ్డం పెట్టుకుని మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఒక్క తెలంగాణ నుంచే ఏటా రూ.700 కోట్లు కొల్లగొడుతున్నట్టు తెలిపింది.*

# సీసీఈ ఉన్నట్టా? లేనట్టా?

- **ఈ సంవత్సరం ఒక్క పదో తరగతికే గ్రేడింగ్ విధానం రద్దు**
- **ఒకటి నుంచి 9వ తరగతులపై ఇప్పటికీ కానరాని స్పష్టత**
- **సమీపిస్తున్న కొత్త విద్యాసంవత్సరం**
- **సాగదీతలతో కాలం వెళ్లదీస్తున్న రాష్ట్రంలోని విద్యాశాఖ**
- **ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ స్పందించని రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యలో నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) ఉన్నట్టా? లేనట్టా? అంటే అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. ఇంతకీ ఈ విధానం రాష్ట్రంలో అమలు చేస్తారా? లేక ముగింపు పలుకుతారా? అన్న అంశంపై క్లారిటీ ఇవ్వడంలేదు. పదో తరగతిలో ఈ విద్యాసంవత్సరం గ్రేడింగ్ విధానాన్ని రద్దుచేశారు. ఈ స్థానంలో మార్కుల విధానాన్ని తీసుకొచ్చారు. వాస్తవానికి గ్రేడింగ్ విధానానికి సీసీఈయే మూలం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క గ్రేడింగ్ విధానాన్ని మాత్రమే రద్దు చేసినట్టు ప్రకటించింది. సీసీఈ విధానం రద్దు అయినట్టు గానీ.. కొనసాగిస్తున్నట్టు గానీ చెప్పలేదు. ఇప్పటికైతే ఈ ఏడాది గడిచిపోయింది. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంకానుంది. ఇప్పటికిప్పుడు దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటేనే జూన్ వరకు సన్నద్ధం కావొచ్చు. విద్యాశాఖ ఏదీ తేల్చడంలేదు. స్పష్టత ఇవ్వడంలేదు. పైగా సాగదీతలు, సస్పెన్స్‌లతో కాలం వెల్లదీస్తున్నది.

### వీటిపై స్పష్టతేదీ..

- ఈ విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులకేమో మార్కులు, 1-9 తరగతులకేమో గ్రేడింగ్ విధానాన్ని అనుసరించారు. ఇలా ఒక తరగతికి ఒక పద్ధతి, మిగతా తరగతులకు మరో పద్ధతి అనుసరించడంతో గందరగోళానికి దారితీయనున్నది. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో దీని ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయినా ఇంకా 1-9 తరగతులపై క్లారిటీ లేదు.
- గ్రేడింగ్ విధానం రద్దుతో పది విద్యార్థులకు మెమోలు ఎలా ముద్రించాలన్న అంశంపై స్పష్టతలేదు. మెమోల్లో పాస్, ఫెయిల్ అని ముద్రించాలా? లేక మార్కులను బట్టి ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి అని ముద్రించాలా..? అన్నది తేల్చడం లేదు. దీనిపై ఎస్సీఈఆర్టీ ప్రతిపాదనలు పంపించినా సర్కారు నుంచి స్పందన లేదు.
- పదో తరగతి మెమోలపై పర్సనల్ పెన్‌ను నిరుటి నుంచి ముద్రిస్తున్నారు. ఈ సంవత్సరం నుంచి అపార్ ఐడీలను జనరేట్ చేస్తున్నారు. మెమోలపై పెన్ నంబర్ ముద్రిస్తారా? లేక అపార్ ఐడీ ముద్రిస్తారా? అనేదీ సందేహాస్పదంగానే మిగిలింది.
- బాసర ఆర్జీయూకేటీలోని సీట్లను ఇప్పటి వరకు పదో తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేస్తున్నారు. గ్రేడింగ్ విధానంతో ఈ సీట్లను సర్కారు స్కూల్ విద్యార్థులే ఎక్కువగా కైవసం చేసుకున్నారు. కొత్తమార్కుల విధానంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ఎగరేసుకుపోయే ప్రమాదముంది. ఈ సీట్లను ఎలా భర్తీ చేయాలన్న అంశంపైనా సర్కారు స్పష్టత ఇవ్వలేదు.

### పన్నెండేండ్ల తర్వాత..

విద్యాహక్కు చట్టం ప్రకారం 2012-13 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని(సీసీఈ) అమలు చేస్తున్నారు. మార్కులు ముఖ్యం కాదు.. బాలల సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమని విద్యాశాఖ ఈ విధానానికి జైకొట్టింది. బడుల్లో ఆటలు, నైతిక విలువలు, పని అనుభవం, కళలకు ప్రాధాన్యం ఇచ్చింది. త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షల స్థానంలో నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలు అమల్లోకి వచ్చాయి. పన్నెండేండ్ల తర్వాత పదో తరగతిలో ఈ సంవత్సరం గ్రేడింగ్ విధానాన్ని రద్దుచేశారు. ఇంటర్నల్ మార్కులుండవని ప్రకటించారు. 80 మార్కులకే వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని విద్యాసంవత్సరం మధ్యలో ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. అప్పటికే ఫార్మేటివ్ పరీక్షలు, సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించారు. చివరికి తప్పిదాన్ని గ్రహించి ఈ ఒక్క ఏడాది ఇంటర్నల్స్‌ను కొనసాగిస్తున్నారు. 1-9 తరగతుల విద్యార్థులకు గ్రేడింగ్ పద్ధతిలోనే మార్కులేస్తున్నారు. దీంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.